క్లుప్తంగా

11న సీత్లాపండుగ జరుపుకోవాలి

పెన్‌పహాడ్ : ప్రతి తండాలో ఈ నెల 11న సీత్లాపండుగ నిర్వహించుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ భూక్య రాజునాయక్ కోరారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీత్లా పండుగకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

క్రీడా పోటీల స్థలం పరిశీలన

సూర్యాపేట రూరల్ : పట్టణ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్‌లో సోమవారం జరగబోయే జీజేఆర్ కప్ క్రీడా పోటీలకు సంబంధించి క్రీడా స్థలాన్ని ఆదివారం డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడానికే మంత్రి జగదీష్‌రెడ్డి జీజేఆర్ కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్‌కే రఫీ, అంజయ్య యాదవ్, బాణోతు జానునాయక్, రాజు, కోటేష్, సైదులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తిరుమలగిరి : మాజీ పార్లమెంట్ సభ్యుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి స్మారక గార్డెన్ నిర్మాణం కోసం ఆదివారం తిరుమలగిరిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భీంరెడ్డి నర్సింహారెడ్డి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి, లలిత, సీతయ్య, యాదగిరి, మల్లయ్య, రాంప్రభు, అబ్రహం, లక్ష్మయ్య, రెహమాన్‌అలీ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



దుర్గమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, తదితరులు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని ధర్మాపురం గ్రామానికి చెందిన కోరాటి కమలమ్మ, నెమ్మాది దుర్గమ్మలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మృతుల కుటుంబాలను ఆదివారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వల్దాసు దేవేందర్, ధర్మా, సతీష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

మోతె : మండల పరిధిలోని అన్నారిగూడెం గ్రామంలో గల మిషన్ భగీరథ నీటి శుద్ధిప్లాంట్‌లో మరమ్మతుల కారణంగా నేడు, రేపు (సోమవారం, మంగళవారం) తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మిషన్ భగీరథ సబ్‌డివిజన్ సూర్యాపేట ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మండలంలోని 41గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తగు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు.

కేసు నమోదు

కోదాడరూరల్ : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ముగ్గురిపై పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. అర్వపల్లి మండలం నుంచి అనుమతులు లేకుండా లారీలో ఇసుకను తీసుకొచ్చి కోదాడ పట్టణంలోని గోపిరెడ్డి నగర్‌లో అన్‌లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ నగేష్‌తో పాటు యజమాని, జేసీబీ ఆపరేటర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఓబీసీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

అర్వపల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం జరిగే ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓబీసీ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోరపాక సత్యం కోరారు. ఈ సమావేశానికి పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు హాజరవుతారని తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు, ఓబీసీ నాయకులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వెళంగిరాజు

కోదాడఅర్బన్ : పట్టణానికి చెందిన ఓర్సు వెళంగిరాజును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఓర్సు వెళంగిరాజు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ఆధునికం వైపు.. అన్నదాత చూపు

- డ్రమ్ సీడర్, సీడ్ డ్రిల్‌తోనే నేరుగా వరినాట్లు
- ఎకరాకు రూ. 6వేల ఖర్చు ఆదా
- పెన్‌పహాడ్ మండలంలో 30 వేల ఎకరాల్లో వరి సాగు అంచనా



నాగులపహాడ్ గ్రామంలో సీడ్ డ్రిల్‌తోనే వరి విత్తనాలు వేస్తున్న రైతు

పెన్‌పహాడ్ : మారుతున్న కాలానికి అనుగుణంగా అన్నదాతలు ఆధునిక వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో రైతులు పంటల సాగులో నూతన పద్ధతులు అవలంభించి పెట్టుబడి భారం నుంచి విముక్తి పొందుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఊతం ఇస్తూ నూతన వ్యవసాయ వంగడాలపై అధికారులతో అవగాహన కల్పిస్తోంది. రైతులకు తక్కువ అద్దెపై పనిముట్లను అందిస్తున్నారు. దీంతో రైతులు డ్రమ్ సీడర్, సీడ్ డ్రిల్, వెదజల్లె పద్ధతుల్లో వరిసాగు చేస్తున్నారు. మండలంలో ఈ వానాకాలంలో 30వేల ఎకరాల్లో వరి వేయవచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు 9వేల ఎకరాల్లో డ్రమ్ సీడర్, సీడ్ డ్రిల్, వెదజల్లె పద్ధతుల్లోనే వరినాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. గత వానాకాలం సీజన్‌లో ఈ పద్ధతుల్లో 4 వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. కూలీల కొరత అధికంగా ఉండే ఈ సమయంలో డ్రమ్ సీడర్‌తో నాట్లు వేస్తూ ఎకరాకు రూ.6వేల వరకు ఆదా చేసుకుంటున్నారు.

నారు పోసే విధానానికి స్వస్తి..

నారుమళ్లు సిద్ధం చేసుకుని వరి విత్తనాలను నారుమళ్లలో చల్లి, మొలకెత్తిన నారును నాట్లు వేయడం ఇప్పటివరకు నడుస్తున్న పద్ధతి. కానీ ప్రస్తుతం డ్రమ్ సీడర్‌తోనే నేరుగా వరి విత్తును నాటడం వల్ల నాటు వేసే కూలీల ఖర్చులు రైతులకు ఆదా అవుతున్నాయి. 15రోజుల్లో ముందుగానే పంట చేతికి వస్తుంది.

విత్తనాలు ఆదా...

మామూలు పద్ధతితో ఎకరాకు 25 నుంచి 30 కిలలో వరకు విత్తనాలు అవసరముంటాయి. డ్రమ్ సీడర్‌తో కేవలం 12 నుంచి 15కిలోల విత్తనాలు సరిపోతాయి. డ్రమ్ సీడర్‌తో వరుస క్రమంలో 12 ఇంచుల గ్యాప్‌తో నాటు వస్తుంది. దీంతో గాలి, వెలుతురు అధికంగా పడి ఎక్కువ వరి మొక్కలు పెరిగే అవకాశం ఉంటుంది. పంటకు చీడపీడలు సోకితే సులభంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే అవకాశం ఉంటుంది. వేరు వ్యవస్థ కోత కోయడానికి అనుకూలంగా ఉండడంతో పాటు, వారం ముందుగానే పంట చేతికి వస్తుంది.

కొత్త పద్ధతిలో విత్తనాలు వేశాం

సీడ్ డ్రిల్ పద్ధతిలో వరి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధిస్తున్నాం. పెట్టుబడి తగ్గడంతో పాటు కూలీల ఖర్చు ఉండదు. దీంతో లాభాలు సాధించవచ్చు.

– వెంకట్‌రెడ్డి, రైతు, నాగులపహాడ్

నూతన పద్ధతులు అవలంబించాలి

వ్యవసాయ శాఖ సూచనలతో రైతులు నూతన పద్ధతులు అవలంబించి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలి. డ్రమ్ సీడర్, సీడ్ డ్రిల్, వెదజల్లె పద్ధతులతో వరినాట్లు వేస్తే కూలీల సమస్య ఉండదు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



– బి. కృష్ణసందీప్, వ్యవసాయ అధికారి

సంక్షేమ పథకాలపై కళాజాతా



తిమ్మాపురంలో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

అర్వపల్లి : ఇంటింటికీ మొక్కలు నాటి తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కోరారు. తిమ్మాపురంలో సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో తెలంగాణకు హరితహారం, సీజనల్ వ్యాధులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు కళాకారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, గజ్జి మంజుల, కుందమళ్ల నాగలక్ష్మి, పోతరాజు శిరీష, మల్లెపాక ప్రియాంక, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రామన్నగూడెం యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా నరేష్



అర్వపల్లి : మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా చాకలిగూడేనికి చెందిన అక్కెనపల్లి నరేష్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేష్‌ను యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ అభినందించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నరేష్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్‌ను గ్రామస్థాయిలో పటిష్టపర్చనున్నట్లు చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేట్ వ్యక్తులతో పారిశుద్ధ్య పనులు

మునగాల : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు నాలుగు రోజులుగా సమ్మె చేస్తుడడంతో మునగాల మేజర్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో పాలకవర్గం ఆదివారం ప్రైవేట్ వ్యక్తులను నియమించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చింతకాయల ఉపేందర్ మాట్లాడుతూ.. నాలుగురోజులుగా గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మెలో ఉండడంతో గ్రామంలో పారిశుద్ధ్యం లోపించిందని, దీంతో పనుల కోసం పది మంది ప్రైవేట్ వ్యక్తులను నియమించినట్లు తెలిపారు.

ఎస్‌ఐల బాధ్యతలు స్వీకరణ



నరేష్, నూతనకల్



ప్రసాద్, తిరుమలగిరి



వెంకన్న, పెన్‌పహాడ్



రవీందర్, మద్దిరాల

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ నూతన ఎస్‌ఐగా నర్సింగ్ వెంకన్నగౌడ్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మధు నాయుడు చివ్వెంల పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. మద్దిరాల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

తిరుమలగిరి ఎస్‌ఐగా ప్రసాద్

తిరుమలగిరి : తిరుమలగిరి మండల ఎస్‌ఐగా ప్రసాద్ ఆదివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన నూతనకల్ మండలంలో పని చేసి బదిలీపై తిరుమలగిరికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ శివకుమార్ సూర్యాపేట డీఎస్పీకి అటాచ్ అయ్యారు.

నూతనకల్ ఎస్‌ఐగా నరేష్

నూతనకల్ : నూతనకల్ ఎస్‌ఐగా నరేష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సూర్యాపేట ట్రాఫిక్ ఎస్‌ఐగా పని చేస్తూ బదిలీపై నూతనకల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

మద్దిరాల ఎస్‌ఐగా రవీందర్

మద్దిరాల : మద్దిరాల నూతన ఎస్‌ఐగా రవీందర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సూర్యాపేట వీఆర్ నుంచి బదిలీపై మద్దిరాలకు వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ నర్సింగ్ వెంకన్న పెన్‌పహాడ్‌కు బదిలీపై వెళ్లారు.

నాగారం సీఐగా శివశంకర్



శివశంకర్, సీఐ, నాగారం

నాగారం : నాగారం సర్కిల్ సీఐగా కె.శివశంకర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సూర్యాపేట జిల్లా డీఎస్‌బీలో పనిచేస్తూ బదిలీపై నాగారం సీఐగా వచ్చారు. గతంలో నాగారం సీఐగా పనిచేసిన బి. రాజేష్ బదిలీపై సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీసీఆర్‌బీకి వెళ్లారు.

అక్రమంగా చెరువుమట్టి తరలింపు



చెరువు మట్టిని తరలిస్తున్న వ్యాపారులు

మునగాల : మండలంలోని కలకోవ ఊరచెరువు నుంచి ఇతర ప్రాంతాలకు చెందిన ఇటుక బట్టీల వ్యాపారులు గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సహకారంతో అక్రమంగా చెరువుమట్టిని తరలిస్తుండడంతో ఆదివారం పంచాయతీ పాలకవర్గం అడ్డుకున్నారు. గ్రామంలోని ఊరచెరువు నుంచి రెండు జేసీబీల ద్వారా ట్రాక్టర్లతో కొందరు ఇటుకబట్టీల వ్యాపారులు చెరువుమట్టిని తరలించి పక్కనే ఉన్న ప్రభుత్వ బంజరు భూమిలో డంపింగ్ చేస్తున్నట్లు పాలకవర్గం సభ్యులు గుర్తించారు. వెంటనే వారు సదరు జేసీబీ డ్రైవర్లను నిలదీశారు. గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సహకారంతో మట్టిని తరలిస్తున్నామని జేసీబీ డ్రైవర్లు సమాధానం చెప్పడంతో పాలకవర్గానికి చెందిన కొందరు స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. డంపింగ్ చేసిన చెరువుమట్టిని రాత్రి సమయంలో ఇటుకబట్టీలకు తరలిస్తున్నట్లు పాలకవర్గం గుర్తించింది. వెంటనే పోలీసులు చెరువు వద్దకు వెళ్లి సదరు జేసీబీలను అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ.. అక్రమంగా చెరువుమట్టిని తరలిస్తున్న ఇటుకబట్టీల వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



పాఠశాలలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి

నడిగూడెం : విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్. ధనవిజయలక్ష్మి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె స్వచ్ఛందంగా రూ.7వేల విలువైన జేఈఈ పుస్తకాలను గ్రంథాలయానికి బహూకరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పాఠశాలలోని గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాలు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ వసంత, రేణుక, వెంకటేశ్వర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె



తిరుమలగిరిలో సమ్మెలో పాల్గొన్న గ్రామ పంచాయతీ కార్మికులు



ఆత్మకూరులో సమ్మెలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు

తిరుమలగిరి : గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచాలని, పర్మనెంట్ చేయాలని జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె 4వ రోజుకు చేరింది. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులను వెంటనే పర్మనెంట్ చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బక్కయ్య, నాగయ్య, శోభ, మహేష్, నాగన్న, సైదులు, రాజు, యాకయ్య, గౌరయ్య, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

నాలుగవ రోజుకు చేరుకున్న సమ్మె

ఆత్మకూర్ (ఎస్) : పలు డిమాండ్ల సాధన కోసం గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మె ఆదివారానికి 4వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట దీక్షలో కూర్చున్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు బండారు సైదులు మాట్లాడారు. గ్రామపంచాయతీలో ఏ పని ఉన్నా తమతోనే చేయిస్తున్నారని, ఈ విధానాన్ని మానుకోవాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు పీటర్, పిడమర్తి ప్రసాద్, పవన్‌కళ్యాణ్, ఎండీ షఫీ, గడ్డం సంధ్య, ఆరెంపుల సోమమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయి

నూతనకల్ : గ్రామ పంచాయతీ కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుడిగ మల్లేష్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొని తన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీపీ కార్మికుల వేతనాలను పెంచడంతో పాటు వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాల మధు, శోబాబాయి, రాంబాబు, నకిరేకంటి శంభయ్య, నెల్లుట్ల కృష్ణ, వెంకన్న, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొని మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

పెన్‌పహాడ్ : గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్ కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న నాలుగో రోజు సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీఓ నంబర్ 51ని వెంటనే రద్దు చేయాలని, కార్మికుడు మరణిస్తే రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కారోబార్‌లందరినీ బిల్లు కలెక్టర్లుగా నియమించాలని, కనీస వేతనం రూ. 19,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు మట్టయ్య, ఎల్లమ్మ, సత్తెమ్మ, వెంకన్న, రమణయ్య, దూదియా పాల్గొన్నారు.

చివ్వెంల : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో చేపడుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగర్, ఈదయ్య, గోపాల్, వెంకన్న, ఈదయ్య, సైదులు, జానయ్య పాల్గొన్నారు.

అర్వపల్లి : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం కోరారు. ఆదివారం నాలుగవ రోజు జరిగిన నిరవధిక సమ్మెలో వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గుగులోతు నాగులు నాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, మహంకాళి యుగందర్ పాల్గొన్నారు.



పెన్‌పహాడ్‌లో..



చివ్వెంలలో..



అర్వపల్లిలో..


25న 'చలో ఢిల్లీ'

కోదాడఅర్బన్ : ఈ నెల 25న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ కన్వీనర్ ధూళిపాళ్ల ధనుంజయనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పెరిక సంఘం భవన్‌లో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా బీసీలు వివక్షకు గురవుతున్నారని అన్నారు. బీసీలు ఎన్ని రూపాల్లో ఉద్యమించినప్పటికీ పాలకుల్లో చలనం లేకుండా పోయిందని, అందుకు ప్రధాన కారణం బీసీల మధ్య ఐక్యత లేకపోవడమేనన్నారు. రైతు బంధు, దళిత బంధు మాదిరిగా బీసీ బంధును రూపొందించి అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఇనుగుర్తి వెంకటరమణాచారి, నాయకులు బచ్చు రాజ్యం, నిగిదాల వీరయ్య, నాగమణి, గోవిందరావు, కృష్ణ పాల్గొన్నారు.


టీడీపీ మండల కమిటీ ఎన్నిక

మునగాల : మండల కేంద్రంలో టీడీపీ మండల నూతన కమిటీని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓరుగంటి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి బయ్యా నారాయణ, పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు కొల్లు నర్సయ్య, పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి ఎర్రం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నాదెళ్ల గోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గోలి పూర్ణశంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా అడిదెల సుబ్బారెడ్డి, ఎర్రం రాజశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా పత్తిపాక మల్లయ్య, చింతకుంట్ల వీరారెడ్డి, కోశాధికారిగా సోమిరెడ్డి వెంకటరెడ్డి, ప్రచార కార్యదర్శులుగా షేక్ సైదా, ఎల్లావుల వీరబాబు, గాడిపర్తి మోహన్‌రావు, గొల్లపూడి గురుస్వామిని ఎన్నుకున్నారు. తెలుగు యువత మండల అధ్యక్షుడిగా మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన ములుగూరి ప్రదీప్‌ను ఎన్నుకున్నారు.

పంచాయతీలకు భవనాల కొరత



సంగెంలో శిథిలావస్థకు చేరిన జీపీ భవనం



బండరామారంలో పూర్తిగా దెబ్బతిన్న జీపీ భవనం

తుంగతుర్తి : గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలు అని అంటుంటారు. అలాంటి వాటి వికాసం కోసం ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అయితే క్షేత్రస్థాయిలో పాలన సాగించేందుకు సరైన భవనాలు లేకపోవడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుంగతుర్తి మండలంలో మొత్తం 24 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో 12 జీపీలు పాతవి కాగా, మరో 12 నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. పాత వాటిలో సంగెం, బండరామారం, తుంగతుర్తి, వెలుగుపల్లి గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరి కూలేదశలో ఉన్నాయి. సంగెం, బండరామారం గ్రామాల పంచాయతీ భవనాలు పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పాలవర్గం, అధికారులు బిక్కు, బిక్కు మంటూ పాలన సాగిస్తున్నారు. ఇక కొత్తగా ఏర్పాటైన 12 జీపీలలో దేవునిగుట్టతండాకు మాత్రమే నూతన భవనం మంజూరైంది. ఇది ప్రస్తుతం నిర్మాణ దశలో ఉండగా, మరో మూడు జీపీ కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇక మిగతా 8జీపీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

అరకొర వసతులతో ఇబ్బందులు..

మండలంలోని పలు జీపీలకు సొంత భవనాలు ఉన్నా అవి ఇరుకు గదులతో ఉన్నాయి. పైగా భవనాలు శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో కురుస్తున్నాయి. దీంతో విలువైన రికార్డులను భద్రపర్చడానికి కష్టంగా మారుతుంది. సర్పంచ్‌లు, కార్యదర్శులు, పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు జీపీ కార్యాలయాల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయా గ్రామపంచాయతీల కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

నూతన భవనం మంజూరు చేయాలి

గ్రామపంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామ సభల నిర్వాహణ ఇబ్బందికంగా మారింది. గ్రామానికి నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరు చేయాలి.

– ఏశమల్ల సుశీల, సర్పంచ్, సంగెం

చిన్న పల్లె.. అభివృద్ధి భలే!

- రామన్నగూడెం ఆవాసం చాకలిగూడెంలో వీధులన్నీ సీసీ రోడ్లే..
- ఇంటింటికీ మిషన్‌భగీరథ నీళ్లు
- సమకూరుతున్న మౌలిక వసతులు



నాలుగు వైపులా సీసీగా మారిన గ్రామ కూడలి రోడ్లు

అర్వపల్లి : అదో మారుమూల పల్లె. ఈ పల్లె ఆవాస గ్రామం. మారుమూలలో ఉన్నా సమస్యలను అధిగమించింది ఈ పల్లె. అదే జాజిరెడ్డిగూడెం మండలంలోని రామన్నగూడెం గ్రామ పంచాయతీ ఆవాసం చాకలిగూడెం. ఈ గ్రామంలో సుమారు 50 ఇళ్లు ఉంటాయి. ఈ గ్రామ జనాభా 150కి పైగా ఉంటుంది. అయితే ఈ గ్రామం ప్రత్యేకతేమిటంటే.. చిన్న కుగ్రామం అయినప్పటికీ గ్రామంలోని వీధులన్నీ సీసీ రోడ్లుగా మారాయి. అలాగే ఈ గ్రామంలో ఇంటింటికీ మిషన్‌భగీరథ నీళ్లు వస్తున్నాయి. కాగా గ్రామంలో దాదాపు సమస్యలంటూ పెద్దగా ఏమీలేవు.

గల్లీ గల్లీకి సీసీరోడ్లే..

గ్రామంలోని ప్రతి గల్లీ సీసీ రోడ్లుగా మారాయి. గతేడాది కొన్ని వీధులు సీసీ కాగా ఈ ఏడాది మరికొన్ని సీసీగా ఏర్పడ్డాయి. గ్రామంలో కేవలం మిగిలిన 30 మీటర్ల మేర సీసీ నిర్మాణం చేపడితే పూర్తిగా గ్రామం సీసీ రోడ్లమయంగా మారనుంది. గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేతో నిధులు మంజూరు చేయించుకొని దాదాపు అన్ని వీధులను సీసీగా చేసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ మిషన్‌భగీరథ నీళ్లు వస్తున్నాయి.

వీధులన్నీ సీసీ చేశారు



మా చిన్న గ్రామంలో మరో 30 మీటర్ల మేర సీసీ నిర్మిస్తే గ్రామం మొత్తం పూర్తిగా సీసీరోడ్లుగా మారనుంది. ఇటీవలే వీధులను సీసీరోడ్లుగా మార్చారు. గ్రామంలో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు వస్తుండటంతో గ్రామంలో నీటి సమస్యలేదు.

– అక్కెనపల్లి సత్తయ్య, చాకలిగూడెం

ఆదర్శ గ్రామంగా మారింది



గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అంచెలంచెలుగా పరిష్కరించుకున్నాం. గ్రామంలో దాదాపు సమస్యలన్నీ తీరాయి. సీడీపీ నిధులతో వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ప్రతి ఇంటికీ మిషన్‌భగీరథ నీళ్లు వస్తున్నాయి. మా గ్రామం ఆదర్శ గ్రామంగా మారింది.

– ఎండీ. హమీద్, మండల పరిషత్ కోఆప్షన్‌సభ్యుడు